ఆయకట్టుకు అందని చెరువు నీరు

- కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ
- శిథిలావస్థకు చేరిన తూము
- ఎండుతున్న యాసంగి పంటలు

సంగెం : అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా తయారైంది రైతుల పరిస్థితి. చెరువు నిండా నీరున్నా పంటలకు నీరు అందని దుస్థితి నెలకొంది. అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం అన్నదాత కన్నీటికి కారణమవుతోంది. గోడు పట్టించుకునే నాథుడే లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువు నిండా నీరుంది. ఈ నీరు చెరువు కింద మొత్తం విస్తీర్ణంలో యాసంగి వరి పంటకు సరిపడడంతోపాటుగా ఖరీఫ్‌కు సరిపోతుంది. దీనికితోడు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి చెరువులోకి నీరు వచ్చి చేరుతోంది. చెరువు కింద అధికారికంగా 760, అనధికారికంగా సుమారు మరో వెయ్యి ఎకరాలకుపైగా సాగవుతోంది. చెరువుకు బుర్రతూము, నక్క తూము, మిట్ట తూము, జాలు తూములున్నాయి. వీటిలో జాలు తూము షట్టర్ గతంలో శిథిలమైపోయింది. ఎక్కువ నీరు బయటకు వెళ్తుండడంతో తాత్కాలికంగా నీరు బయటకు పోకుండా ఏర్పాట్లు చేశారు. వానాకాలంలో వర్షాలకే పంటలు పండిన విషయం తెలిసిందే. జాలు తూము సుమారు 7 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించి అధికారికంగా 375 ఎకరాలు, అనధికారికంగా మరో 300 ఎకరాలు సాగవుతోంది. మిట్ట తూము కింద సుమారు 150 ఎకరాల్లో వరి సాగవుతోంది. దీని షట్టర్ శిథిలమై విరిగి పడి జామ్ కావడంతో తూము నుంచి నీరు తక్కువగా వస్తోంది. షట్టర్ రాడ్ విరిగిపడడంతో తాళ్ల సాయంతో కట్టి



రాడ్ విరగడంతో తాళ్లతో కట్టిన తూము

ఉంచారు.

కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క.....

చెరువు పంట కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ అల్లుకుపోయి ఆయకట్టు చివరి పంటలకు నీరు అందని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో వరి నారు ముదిరిపోతుండడంతో నాటు వేసుకునేందుకు రైతులే కాల్వల్లోకి దిగి అల్లుకుపోయిన తీగను తొలగిస్తున్నారు. నీరందని పరిస్థితిలో ఇప్పటికీ నాటు వేయకుండా నీటి కోసం రాంత్రిబవళ్లు కాపుకాయల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూము నుంచి తక్కువగా నీరు వస్తుండడంతో రైతుల నడుమ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారుల మీద ఆశ వదులుకుని కొందరు రైతులు తామే కొంత మేరకు గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి తూము షట్టర్‌కు మరమ్మతు చేయించడంతోపాటు కాల్వల్లోని జమ్ము, గుర్రపు డెక్కను తొలగించి చివరి ఆయకట్టుకు సైతం నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



గుర్రపు డెక్కను తొలగిస్తున్న రైతులు

నీరందించి ఆదుకోవాలి

చెరువు నిండా నీరు ఉన్నా కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ నిండడంతో నీరు అందని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించి నీరందించి రైతులను ఆదుకోవాలి.

– బోనాల లింగమూర్తి, రైతు

సమస్య పరిష్కరిస్తాం

ఎల్గూర్ రంగంపేట చెరువు నిండా నీరుంది. మిట్టతూము షట్టర్ పాడైపోగా మరమ్మతు చేయించే పరిస్థితి లేదు. నీరు అయిపోయాక మరమ్మతు చేయిస్తాం. కాల్వల్లో జమ్ము తొలగించి నీరందేలా ఏర్పాట్లు చేసి సమస్య పరిష్కరిస్తాం.

– హామీద్, ఐబీ ఏఈ

మెనూ సక్రమంగా అమలు చేయాలి

- రాజేశ్ నాయక్

కమలాపూర్ : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన మెనూను సక్రమంగా అమలు చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి మాలోతు రాజేశ్‌నాయక్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌ను ఆదివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త మెనూ ప్రవేశ పెట్టిందని, కానీ సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. ఒక్కో విద్యార్థికి 50 గ్రాముల మటన్ వడ్డించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కానీ ఒక విద్యార్థికి 50 గ్రాముల మటన్ ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి విద్యార్థులకు సరిపడా వడ్డించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు చలికాలంలో పూర్తిస్థాయిలో దుప్పట్లు, దోమతెరలు, అకాడమిక్ ఇయర్ ప్లానింగ్ ముందుగానే అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి రాకేశ్, నాయకులు మహేష్, అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ చేసేవరకూ ఉద్యమిస్తాం



శాయంపేట : ప్రదర్శన చేస్తున్న నాయకులు



పరకాల : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : ఎస్సీ వర్గీకరణ చేసేవరకూ ఉద్యమం ఆగదని ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్ అన్నారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వేల గొంతులు–లక్ష డప్పులు ప్రదర్శనకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్ ఆధ్వర్యంలో సన్నాహక ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. మాదిగ ఉపకులాల వర్గీకరణకు సుప్రీంకోర్టు నిర్ణయాన్ని గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ ప్రక్రియను మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు దయాకర్, ఎమ్మెస్పీ నాయకుడు సూరన్న, రవీందర్, విజయ్‌కుమార్, దేవయ్య, శివ, సాంబయ్య, బాబు, సదయ్య పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పులు ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి రవీందర్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ప్రసాద్, కుమార్, వెంకటేశ్వర్లు, రమేశ్, శోభన్, శ్రీనివాస్, రామస్వామి, ఐలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్ష డప్పులు ప్రదర్శనకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బొక్కల నారాయణ, మరుపట్ల దేవదాసు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో సింగార రాంచందర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని నియమించిన అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కాగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రితిక రమేశ్, ఉపాధ్యక్షులుగా సింగారపు ఎల్లస్వామి, రిపికా రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా రిపికా రాజు, సహాయ కార్యదర్శులుగా యాదగిరి, రాజు, గౌరవ అధ్యక్షుడిగా రాజుతో పాటు ముఖ్య సలహాదారులను నియమించారు. జిల్లా నాయకులు రమేశ్, మండల అధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు రవికుమార్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు బాబు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

పరకాల : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్ష డప్పులు ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ నాగారం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. నాగారం నూతన కమిటీ అధ్యక్షుడు పసుల రాజశేఖర్, ఉపాధ్యక్షులు పసుల రవి, చిలువేరు సాంబయ్య, ప్రధాన కార్యదర్శి రామంచ ఆదినారాయణ, కార్యదర్శులుగా ఆదినారాయణ, పోలెపాక రాజేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు

పర్వతగిరి : విలేకరులమంటూ డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న మండల కేంద్రానికి చెందిన దొడ్డ శ్రీనివాస్, చింతనెక్కొండకు చెందిన బోనాల సాంబయ్యపై మండల కేంద్రానికి చెందిన దుంపల వేణు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తను పాక్లెయిన్ నడుపుతూ ఉపాధి పొందుతుండగా డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్, సాంబయ్య వేధిస్తున్నట్లు వేణు తెలిపాడు. ఇప్పటి వరకు కొన్ని డబ్బులు ముట్టజెప్పానని, అయినా ఇబ్బంది పెట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. డబ్బులు ఇవ్వకపోతే పేపర్‌లో వార్తలు రాస్తామని బెదిరించినట్లు చెప్పాడు. ఈ విషయమై ఎస్సై బోగం ప్రవీణ్‌ను వివరణ కోరగా ఇద్దరు విలేకరులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వేణు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని..

సంగెం : రైతులు వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో అడ్డుగా కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని లోహితకు చెందిన కోల రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై నరేశ్ వివరాలు వెల్లడించారు. లోహితకు చెందిన చెరుకు రాజు ఏడేళ్ల క్రితం దారికి కంచె వేస్తే ఆ దారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే సుమారు 40 రైతులు అధికారులకు విన్నవించడంతో తీసేశాడని తెలిపారు. మళ్లీ శనివారం కంచె వేయడంతో విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలకు మద్దతు

వర్ధన్నపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమాలకు ప్రజా సంఘాల నాయకులు జన్ను రాములు, డీఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి, అంజయ్య, ఈరెల్లి శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంద కృష్ణ సుమారు 30 ఏళ్లుగా పోరాటాలు కొనసాగిస్తారని చెప్పారు. ఈనెల 7న తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. తుమ్మల కుమారస్వామి మాట్లాడుతూ మంద కృష్ణ పోరాటాల ఫలితంగానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ అమలుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తుమ్మల కుమార్, కంజర్ల సందీప్, సమ్మయ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



రాయపర్తి : మండలంలోని మైలారంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించే లక్ష్యంతో ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసక్తి కలిగిన జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చాటిన జట్లకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, ఉప్పుగల్ల శ్రీనివాస్, పరుపాటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

బేరుండా అమ్మవారిగా రాజరాజేశ్వరి

హన్మకొండ కల్చరల్: శిశిర నవరాత్రుల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారిని బేరుండా అమ్మవారిగా ఆదివారం అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరుడి ఊరేగింపు

వరంగల్ చౌరస్తా: బ్రహోత్సవాల్లో భాగంగా వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామిని ఆదివారం ఊరేగించారు. ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, మూలమంత్ర హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదం, తదియారాధన (అన్న ప్రసాద) వితరణ జరిగింది. ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసా చార్యులు పాల్గొన్నారు.

కూలీ బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న రాజేందర్

హసన్‌పర్తి: ఉపాధి కూలీలకు కూలీ బీమా పథకాన్ని వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ కూలీల దినోత్సవాన్ని హసన్‌పర్తి మండలం సీతంపేటలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనిదినాలను వంద రోజుల నుంచి రెండు వందల రోజులకు పెంచాలని సూచించారు. కూలీలకు పని ప్రదేశం వద్ద ప్రమాద బీమాను రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పెంచాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డుల కంటే పనికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకురాలు బౌతు రాధ, భాగ్య, రమాదేవి, కూలీలు వసంత, లక్ష్మి, నిర్మల, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని

కాజీపేట రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతోపాటు వారికి నచ్చిన రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని గాబ్రియల్స్ స్కూల్ పూర్వ విద్యార్థి మంచిర్యాల డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి శివ్ ఆశిష్ సింగ్ సూచించారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్ మైదానంలో శనివారం రాత్రి వరకు జరిగిన ప్లాటినం జూబ్లీ (70వ వార్షికోత్సవం) వేడుకలకు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పొలిశెట్టి అధ్యక్షతన వహించగా, ముఖ్యఅతిథి శివ్ ఆశిష్ సింగ్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో రోమ్ ఫార్మర్ సుపీరియర్ జనరల్ మాంట్‌ఫోర్టు బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గ్యాబ్రియల్ రెవ.బ్రదర్ జాన్ కల్లారకల్, పూర్వ విద్యార్థులు డాక్టర్ రమ్య మాదిరెడ్డి, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ నేహ అగర్వాల్, సులక్ష్య సేవా సమితి ఫౌండర్ సంతోష్ మండువ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల సాధనకు చలో కలెక్టరేట్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. అందుకు భూపోరాటానికి సీపీఎం సిద్ధంగా ఉందని అన్నారు. న్యూశాయంపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పట్టాల సాధనకు ఈనెల 4న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, మదన్‌చారి, దార్న ప్రభాకర్, మొగిళి, మురళి, లక్ష్మి, రజిత, భవాని, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కయ్య

ఆలయంలో పునరుద్ధరణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ఆవరణలో కూర్మ యంత్ర శంకు పూజలు, జపాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అర్చకులు కృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు, మాధవాచార్యులు, రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, శేషాచార్యులు, వెంకటనర్సింహాచార్యులు, శ్రీకర్, రంగనాథస్వామి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈనెల 7న ఉదయం 11.26 నిమిషాలకు ముగ్గు పోసే పనితోపాటు కూర్మ యంత్ర, శంకు ప్రతిష్ఠలకు ప్రధాన అర్చకులు వెంకటాచార్యులు ముహూర్తం నిర్ణయించారు. భక్తులు వాస్తు పూజలో పాల్గొని నవ ధాన్యాలు, ముత్యం, పగడం, బంగారం వంటివి సమర్పించి ఆధ్యాత్మిక భజన, పారాయణాలు చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేమిశెట్టి శ్రీనివాస్, సభ్యులు చింతల నిరంజన్, రామగోని సుధాకర్, వీరమనేని వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు పెండెం రామానంద్, మెరుగు లక్ష్మణ్, బాబు, పాలాయి రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ ఖన్నా

వర్ధన్నపేట : క్రీడలతో శారీరక, వికాసం కలుగుతాయని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో యువతకు ఆదివారం ఆయన క్రీడాదుస్తులు, క్రికెట్ కిట్ అందజేసి మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని సాధన చేయాలన్నారు. తద్వారా క్రీడల్లో రాణించి మండల, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గ్రామ కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తామని చెప్పారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, స్నేహ సంబంధాలు మెరుగవుతాయని తెలిపారు. యువత క్రీడల్లో రాణిస్తే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. క్రీడాసామగ్రిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల్లో రాణించే వారికి సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.



క్రీడాదుస్తులు, క్రికెట్ కిట్ అందజేస్తున్న రాజేశ్

నాపై అసత్య ప్రచారాలు సరికాదు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఇంట్లో జరిగిన సమావేశానికి తాను వెళ్లినట్లు కొందరు పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి, మంత్రులపై అసమ్మతిగా ఉన్నట్లు తన ప్రమేయం లేకుండా యూట్యూబ్, పలు పత్రికల్లో ఫొటోలతో కథనాలు ప్రచురించడం సరైంది కాదని పేర్కొన్నారు. సహచర ఎమ్మెల్యేలను కలవడంలో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు తాను వెళ్లలేదు కదా అని పేర్కొన్నారు.

ఉద్యోగులకు మినహాయింపు సరైంది

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు ఐటీ మినహాయింపు మంచి పరిణామమని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రామాల్లో సిబ్బంది లేక సతమతం అవుతుంటే, అక్రమంగా మట్టి, ఇసుక రవాణాను అడ్డుకునేందుకు సెలవు దినాల్లో సైతం గిర్దావర్లు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. సమావేశంలో నరసింహనాయక్, మహ్మద్ సలీంపాషా, మారుపట్ల మల్లయ్య, సాంబరాజు, ఐలయ్య, భూక్యా కన్న నాయక్, సాంబయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకే కేంద్ర బడ్జెట్

న్యూశాయంపేట: బడా కార్పొరేట్ శక్తులకే కేంద్రం బడ్జెట్ భరోసా ఇచ్చిందని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అన్నారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను వంచన చేసి, బడా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా ఉందని విమర్శించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జక్కు రాజు, నాయకులు సదానందం, రామ్మూర్తి, లక్ష్మణ్, రాజేందర్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని పడాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకుడు మాద్రాజు వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలు, నాగమయ్య పడిగె, శివలింగాలను దాతల సహకారంతో ప్రతిష్ఠించారు. తొలుత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని పూజారుల వేదమంత్రోచ్ఛరణల నడుమ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం చేశారు. ఆలయం వద్ద జాతర నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పండుగా వాతావరణం నెలకొంది.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



నల్లబెల్లి : ప్రజాపాలనలో భాగంగా మండలంలోని రాంతీర్థం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేరుగు శ్రీను మాట్లాడారు. 33 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 71 మందికి రేషన్‌కార్డులు, 20 మందికి ఆత్మీయ భరోసా పథకం అందించేందుకు అధికారులు అర్హులను ఎంపిక చేసినట్టు తెలిపారు. గ్రామంలో మరో సుమారు 10 మంది అర్హులకు పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు చిర్ర నరేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాహెరా, మండ కల్పన, సంపత్, పాదిల శోభన్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహా కార్యదర్శిగా సదానందం



శాయంపేట : బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బత్తిని సదానందంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతితో పాటు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్ : మండలంలోని మాదన్నపేటలో యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కొడారి నరేష్, ప్రధాన కార్యదర్శిగా గొర్రె కుమారస్వామి, ప్రచార కార్యదర్శిగా చిలువేరి నవీన్, కోశాధికారిగా కొడారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కొడారి ఓదెలు, మిరియాల రాజు, కొడారి రాజు, కోల నరేష్, వంగ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గొర్రె రాజయ్య, వంగ సాంబయ్య, గొర్రె సారయ్య, సాంబయ్య, సారయ్య నియామకమయ్యారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా భగవాన్‌రెడ్డి

ఆత్మకూరు : ఆత్మకూరు గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వంగాల భగవాన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం రెడ్డి సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 79ఓట్ల మెజార్టీతో భగవాన్‌రెడ్డి గెలిపొందారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం సభ్యులు సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



హనుమకొండకు తరలివెళ్లిన బీసీలు



శాయంపేట : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించతలపెట్టిన బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభకు ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీసీ వర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వ్యవస్థాపక నాయకుడు కొమురయ్య, మండల అధ్యక్షుడు నర్సయ్య జెండా ఊపి బస్సులు ప్రారంభించారు. నాయకులు నవీన్, సాంబమూర్తి, రాజేశ్, ప్రకాశ్, రాకేశ్, చిరంజీవి, ప్రభాకర్ తదితరులు వెళ్లినవారిలో ఉన్నారు.

పరామర్శ

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పోరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ నాయకుడు ఉల్లెంగుల యాదగిరి ఆదివారం శ్యాంసుందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ప్రొఫెసర్ ముత్తిలింగం, సీనియర్ న్యాయవాది సురేశ్ తదితరులు ఉన్నారు.